క్లుప్తంగా

సీతారామస్వామి ఆలయంలో శాంతి కల్యాణం



గుండుగొలనులో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

భీమడోలు: గుండుగొలనులో దేవదాయ ధర్మశాఖ పరిధిలోని ప్రసిద్ధి గాంచిన పురాతన సీతారామస్వామి ఆలయంలో ఆదివారం శాంతి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగరాజ్ కుమార్ పర్యవేక్షణలో యాజ్ఞిక స్వామి దివి గోపాలాచార్యులు, ఆలయ అర్చక స్వామి సాయి సుధీరాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. ఆలయంలోని ధృవ మూర్తులకు అభిషేకాలు, ఉత్సవ మూర్తులకు శాంతి కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జూనియర్ గృహసమితి సభ్యుల ర్యాలీ

దెందులూరు: యువత చిన్ననాటి నుంచి దేవుని ఆశయాలకు అనుగుణంగా క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో మెలగాలని, నిరంతర ప్రార్థనలతో జీవించాలని సాల్వేషన్ ఆర్మీ కో ఆఫీసర్ మేజర్ సువర్ణభాయి ఆదివారం అన్నారు. దెందులూరులో క్రైస్తవ గీతాలాపనతో జూనియర్ గృహ సమితి సభ్యులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏలూరులో నిర్వహించనున్న జూనియర్ గృహసమితి ర్యాలీకి వారు తరలివెళ్లారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలను వినియోగించుకోవాలి



అర్ధవరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సంతోష్

గణపవరం: గ్రామాల్లో ప్రజల ఇళ్ల వద్దకే వచ్చి వైద్య సేవలు అందించడం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. గణపవరం మండలం అర్ధవరంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు అందజేశారు. సీహెచ్‌వో జాలాది విల్సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గొరిపర్తి కుటుంబానికి కొఠారు పరామర్శ

దెందులూరు: గొరిపర్తి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను ఆదివారం కొవ్వలిలో ఆయన నివాసంలో ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు పరామర్శించారు. గొరిపర్తి వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందిన సంగతి విదితమే. గొరిపర్తి కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ధైర్యంగా ఉండాలని కొఠారు అన్నారు. దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, మండల వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, ఎంపీటీసీ గొరిపర్తి వరలక్ష్మి రంగారావు తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలో ఎస్‌వీఎస్ హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కన్నెగొల్ల రాఘవ కుమార్ మానేపల్లి రామారావు పర్యవేక్షణలో 292 మందికి మ్యాన్ కైండ్ ఫార్మ సంస్థ సహకారంతో బీఎండీ స్కాన్ ద్వారా ఎముకలు, యూరోపతి పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో ఎస్వీఎస్ హాస్పిటల్ డాక్టర్ కే.కార్తీక్ 145 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ కె.మానస 18 ఏళ్లలోపు పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. రెటీనా వైద్య నిపులు డాక్టర్ కె.అనుదీప్ 126 మందికి కంప్యూటర్‌పై కంటి పరీక్షలు నిర్వహించారు. 24 మందికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తామని చెప్పారు. శిబిరంలో మ్యాన్ కైండ్ ఫార్మా మేనేజర్ వి.శ్రీరాములు బృందం మందులు పంపిణీ చేశారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ఏలూరు (టూటౌన్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు కోరారు. స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయం నందు భవన నిర్మాణ కార్మికకుల సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. పరసా శ్రీను, రెడ్డి లక్ష్మణరావు, ఎం.గోపాలకృష్ణ, పరసా రాజేష్, చీర అప్పారావు, షేక్ మస్తాన్, సీహెచ్ భాస్కరరావు పాల్గొన్నారు.

తొలకరి పంటపై తెగుళ్ల దాడి

- చిరుపొట్ట దశలో వరి పైరు
- ఆందోళనలో అన్నదాతలు
- ముమ్మరంగా నివారణ చర్యలు



తెగుళ్ల నివారణకు పెదవేగిలో మందులు పిచికారీ చేస్తున్న రైతులు

పెదవేగి : తొలకరిపై తెగుళ్ల దాడి చేస్తున్నాయి. ప్రస్తుతం వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు, ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసాలు ఖరీఫ్ పంటపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. దీంతో ఉల్లికోడు, తెల్లదోమ, మాగుడు తెగుళ్ల ఆశించి పంటకు నష్టం కలుగజేస్తున్నాయి. నివారణ చర్యలతో పెట్టుబడి తడిసి మోపడవుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉల్లికోడు నివారణకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

41,500 ఎకరాల్లో సాగు

నియోజకవర్గానికి పెదవేగి, దెందులూరు, పెదపాడు మండలాల్లో 41,500 ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట చిరుపొట్ల దశ నుంచి పొట్ట దశల్లో ఉంది. ఈ దశలో పలుచోట్ల మాగుడు, తెల్లదోమ, ఉల్లికోడు ఉండటం రైతులను కలవరపరుస్తోంది. మాగుడు తెగులుతో ఆకులపై మచ్చలు ఏర్పడి వరి దుబ్బులు ఎండిపోతుండగా, ఆలస్యంగా నాట్లు వేసిన పొలాల్లో తెల్ల దోమ బెడద అధికంగా ఉందని రైతులు అంటున్నారు. తెల్లదోమ ఆకుల్లో రసాన్ని పీల్చేయడం వలన ఆకులు పసుపు రంగులోకి మారుతున్నాయంటున్నారు. ఉల్లికోడు ప్రభావంతో వరి దుబ్బు మధ్యలోని ఆకులు చుట్టబెట్టుకుపోయి వెన్ను రావడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఆయా తెగుళ్ల పంటపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని, నివారణ కోసం ఎకరాకు వేల రూపాయలు పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందంటున్నారు.

దోమ ఆశించడానికి కారణాలు

సాధారణంగా సెప్టెంబర్ నుంచి ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం చల్లబడాలి. కాని అందుకు భిన్నంగా వాతావరణంలో అధిక ఉష్ణోగ్రతలు చోటు చేసుకుంటున్నాయి. వాతావారణంలో తేమ అధికంగా ఉండడం, ఉక్కపోత వాతావరణం దోమ ప్రబలడానికి దోహదమవుతోంది. దీనికి తోడు ఏడాది పొడవునా వరి సాగు చేయడం, నారు దశ నుంచే రైతులు రెండు మూడు రకాల సస్యరక్షణ మందులను మిశ్రమం చేసి పిచికారీ చేయడం, నత్రజని కలిగిన ఎరువులను మోతాదుకు మించి వాడడం దోమ ప్రబలడానికి కారణంగా వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నివారణ ఇలా...

తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పెదవేగి వ్యవసాయాధికారి ఎం ప్రియాంక వివరించారు. మాగుడు నివారణకు అరికట్టేందుకు ఎక్సా కొనేజాల్ లేదా వెలిడామైసిన్ మందును లీటర్ నీటికి రెండు ఎంఎల్ చొప్పున ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. తెల్లదోమ నివారణ కోసం ఎసిఫేట్ మందును లీటర్ నీటికి 1.6 గ్రాములు చొప్పున ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. ఉల్లికోడుకు తెగులుకు నివారణ లేదని, పొలంగా తెగులు కనిపిస్తే మిగిలిన దుబ్బులకు వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అందులో భాగంగా కార్బొసిరాన్ లేదా, కార్టాఫ్‌హైడ్రోక్లోరైడ్ గుళికలు ఎకరాకు 10 కిలోలు చొప్పున వేయాలన్నారు.

తొలి దశలో ఉంది



పెట్టుబడులు పెరిగిపోయాయి. ఈ ఏడాది తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంది. ఇప్పటికే నాలుగైదు సార్లు మందులు పిచికారీ చేయాల్సి వచ్చింది.

– జలగం రామ్మోహనరావు, వంగూరు రైతు

ఏం చేయాలో తెలియడం లేదు



పంటను తెగుళ్ల ఆశిస్తుండడంతో మందులు పిచికారీ చేస్తు న్నా పెద్దగా ఫలితం ఉండటం లేదు. అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చింది.

– కొట్టే సురేష్‌కుమార్, రైతు

పురుగు మందులు వాడవద్దు



వరి చేనును తెల్ల దోమ, సుడి దోమ తొలి దశలో ఆశిస్తుంది. రైతులు విచక్షణా రహితంగా పురుగు మందులను వాడకూడదు.

– ఎం ప్రియాంక, వ్యవసాయాశాఖాధికారి, పెదవేగి

జాతీయ పోటీలకు సచివాలయ ఉద్యోగి ఎంపిక



వలపుల సౌజన్య

పెదవేగి : పెదవేగి మండలం విజయరాయి సచివాలయంలో గ్రేడ్ 5 కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న వలపుల సౌజన్య జాతీయ సివిల్ సర్వీస్ ఉద్యోగుల బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా అధికారులు ఆదివారం ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ సౌజన్య ఇటు విధుల్లోనూ, క్రీడల్లోనూ అంకితభావంతో ఉండేవారన్నారు. మండల పరిధిలోని సచివాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు.

కృష్ణుడి ఆలయం వద్ద అన్నసమారాధన

నిడమర్రు: నిడమర్రు మండలం బువ్వనపల్లిలో జగ్గయ్యచెర్వు వద్ద శ్రీకృష్ణుడి ఆలయం వద్ద కృష్ణాష్టమి వేడుకల ముగింపు సందర్భంగా ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయం వద్ద భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కృష్ణాష్టమి సందర్భంగా ఆలయం వద్ద మూడు రోజులుగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

47 ఏళ్ల తర్వాత కలిసిన ఆనందంలో సందడి

భీమడోలు: గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1975–76 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలిసి సందడి చేశారు. ఇక్కడ చదువుకుని నాలుగు దశాబ్దాలకు పైగా గడిచిన వారంతా కుటుంబ సమేతంగా చేరుకుని ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. దేశ, విదేశాల్లో, వివిధ వృత్తి, వ్యాపారాల్లో స్థిరపడినప్పటికీ వారంతా తమ బాల్య స్నేహితులను కలిసేందుకు ఎంతో ఆతృతతో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పాదాభివందనం చేసి సత్కరించారు. తమ స్నేహితులను కలవాలన్న చిరకాల వాంఛ నెరవేరడంతో ఆప్యాయంగా పలకరించుకుంటూ వారంతా ఆనందంలో మునిగి తేలారు. 47 ఏళ్ల క్రితం ఇక్కడ చదివిన పూర్వ విద్యార్థులంతా తమ మనుమలు, మనవరాళ్లకు పాఠశాల పరిసరాలను చూపి మురిసిపోయారు. గురువులు లక్ష్మీపతి అప్పారావు, కొండూరి గురుమూర్తిని ఘనంగా సత్కరించారు. ఇదే బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి మామిళ్లపల్లి రమణమూర్తి ఆర్థిక సాయంతో డైనింగ్ హాల్‌ను నిర్మించారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం సమయంలో ఎటువంటి ఇబ్బందులు పడకుండా తమ వంతు కృషి చేసామని వారన్నారు. దాతను పూర్వ విద్యార్థుల బృందం అభినందించింది. అనంతరం వారంతా సహపంక్తి భోజనం చేసారు.

ప్రైవేటు ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు ఇవ్వాలి



నారాయణపురం లయన్స్ ఆడిటోరియంలో సమావేశమైన అపుస్మా సభ్యుల

ఉంగుటూరు: ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు అందజేయాలని పశ్చిమగోదవరి జిల్లా అపుస్మా సమావేశంలో సభ్యులు కోరారు. ఆదివారం ఉంగుటూరు మండలం నారాయణపురం లయన్స్ ఆడిటోరియంలో ఏలూరు జిల్లా అపుస్మా సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా సంఘ అధ్యక్షుడు గుణ్ణం బుల్లబ్బాయి అధ్యక్షత వహించారు. సమావేశంలో ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు మూడేళ్ల నుంచి 8 ఏళ్ల వరకు కాలపరిమితిని పెంచినట్టు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే 94 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. సమావేశంలో డీఈవో శ్యామ్‌సుందర్, అపుస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.తులసీ విష్ణుప్రసాదు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎంబీఎస్ శర్మ, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు భూరుగుపల్లి గోపాలకృష్ణ, జిల్లా కోశాధికారి రవిశంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, జిల్లా సెక్రటరీ ఎం శివకుమార్ పాల్గొన్నారు.

పోలీసుల పహారా



సూరప్పగూడెం వద్ద పోలీసు సిబ్బందితో కలిసి పహారా కాస్తున్న ఎస్సై చావా సురేష్‌కుమార్

భీమడోలు: మాజీ సీఎం చంద్రబాబు నాయుడుకు కోర్టు రిమాండ్ విధించడంతో గ్రామాల్లో అల్లర్లు, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందుస్తు జాగ్రత్తలను తీసుకుందని భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ ఆదివారం రాత్రి తెలిపారు. చంద్రబాబు నాయుడును రాజమండ్రి జైలుకు తరలించే క్రమంలో మండల పరిధిలో ఎటువంటి ఆందోళనలు, సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. మండల పరిధిలోని జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై పోలీసులు పహారా కాసారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం ప్రధాన సూత్రధారిగా ఉన్న చంద్రబాబుకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించిన నేపథ్యంలో జిల్లా ఎస్సీ మేరి ప్రశాంతి ఆదేశాల మేరకు గ్రామాల్లో 144 సెక్షన్‌ను పక్కా అమలు చేస్తున్నామన్నారు. ఎక్కడా గుంపులు గుంపులుగా ఉండవద్దన్నారు. పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు. సమావేశాలు, సభలను నిర్వహించరాదని పేర్కొన్నారు. ఈ నిబంధనలు ఈనెల 16వ తేదీ వరకు అమలవుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని ఆయన కోరారు.

ఏఎంసీ పదవీ కాలం పొడిగింపు

- 2024 ఫిబ్రవరి 2 వరకూ పొడిగించిన ప్రభుత్వం
- ఏఎంసీ సభ్యులకు ఉత్తర్వులు అందజేసిన ఆళ్ల నాని



ఏలూరు క్యాంపు కార్యాలయంలో ఉత్తర్వులను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆళ్లనాని

ఏలూరు టౌన్: ఏలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) అభివృద్ధికి కృషి చేయాలని, రైతన్నలకు ఎల్లప్పుడూ అండగా నిలవాలని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళనాని చెప్పారు. ఏలూరు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏఎంసీ కమిటీ 2024 ఫిబ్రవరి 2 వరకూ గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా వాటిని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళ నాని అందజేశారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, డైరెక్టర్లకు ఉత్తర్వులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ళనాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతు పక్షపాతిగా రైతన్నలకు మేలు చేయాలనే సంకల్పంతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. రైతులకు ఏఎంసీ నిత్యం అండగా నిలబడుతూ వారిలో భరోసా నింపాలని సూచించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్లు మేతర సురేష్, సాసుపల్లి యుగంధరప్రసాద్, జక్కుల బెనర్జీ, మహ్మద్ ఖాజా, ఉయ్యాల వెంకటరమణ, మట్టా ధనలక్ష్మి, కాళిదాసు దుర్గ ఉన్నారు.

నూతన వితంతు పింఛను అందజేత



దెందులూరులో నూతన వితంతు పింఛను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దెందులూరు: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరిరాజు, ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి ఆదివారంఅన్నారు. నూతనంగా మంజూరైన వితంతు పింఛన్‌ను సొమ్ము రూ. 2,750 లబ్ధిదారు నాయుడు పద్మకు ఎంపీటీసీ తోట విజయకుమారి, అజిత్‌తో కలిసి అందించారు.లబ్ధిదారురాలు నాయుడు పద్మ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి కృతజ్ఞతలు తెలిపారు.

12, 13 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు

భీమడోలు: భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆట స్థలంలో ఈనెల 12, 13వ తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాల బాలికలకు పోటీలను నిర్వహిస్తున్నామని మండల కోఆర్డినేటర్ వి.వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈనెల 12న మంగళవారం అథ్లెటిక్స్, 13న గేమ్స్‌పోటీలు నిర్వహించన్నుట్టు ఆయన తెలిపారు. ఆసక్తిగల బాల బాలికలు అధిక సంఖ్యలో ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ఆయన కోరారు. మండల పరిధిలోని ఉన్నత పాఠశాలలు, వారి పరిధిలోని టీచర్లు క్రీడాకారులను విధిగా తీసుకుని రావాలని ఆయన తెలిపారు.

12,13 తేదీల్లో మండలస్థాయి క్రీడాకారుల ఎంపిక

దెందులూరు: దెందులూరు మండలంలో అండర్– 14, 17 బాలబాలికలకు మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని ఫెడరేషన్ ఏలూరు జిల్లా కార్యదర్శి పోతునూరు ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.కృష్ణారావు అన్నారు. ఆదివారం ఆయన పోతునూరులో మాట్లాడుతూ మండలంలోని అన్ని యాజమాన్య ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 12న కొవ్వలి ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలు 13న మండల స్థాయి అథ్లెటిక్ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులను ఆయా ఆటల పోటీల తాలూకా వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నత పాఠశాలకు తీసుకురావాలన్నారు.

పుస్తక పఠనంతో మానసిక ఆరోగ్యం

భీమడోలు: భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ పాఠశాలకు చెందిన చిన్నారులు పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేసారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యం పొందాలంటే పుస్తకాలు బాగా చదవాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. పెద్దలు కడగల సత్యనారాయణ, మోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మేధాశక్తి పెంపు

పెదవేగి : చిన్నతనం నుంచి పుస్తక పఠనం అనేది విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందుతుందని పెదవేగి గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్ చెప్పారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని గ్రంథ పాలకుడు విద్యార్థులతో నిర్వహించారు.

15న విజయవాడలో అగ్రిగోల్డ్ బాధితుల దీక్షలు

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్‌తోపాటు మరో ఏడు రాష్ట్రాల్లో అగ్రిగోల్డ్ ఏజెంట్లు, కష్టమర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15న విజయవాడ జింఖానా గ్రౌండ్లో సామూహిక దీక్షలు నిర్వహిస్తున్నట్లు అగ్రిగోల్డ్ ఏజెంట్లు, కష్టమర్ల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు యర్రా వెంకటేశ్వరరావు, బండి వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్వూర్తి భవన్ నందు ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో దీక్షలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 8 ఏళ్లుగా అసోసియేషన్ రాష్ట్ర నాయకత్వం పోరాట ఫలితంగా రూ.20 వేల లోపు బాండ్ల వరకూ రాష్ట్ర ప్రభుత్వం చెల్లించడం జరిగిందన్నారు. ఇంకా అనేక లక్షల మంది లబ్ధిదారులకు బాండ్స్, స్థలాలు ఇవ్వాల్సి ఉందన్నారు. అగ్రిగోల్డ్ బాధితులు ఆర్థిక ఇబ్బందులతో వందలాదిమంది ఆత్మహత్యలు, అనారోగ్యాలతో చనిపోయారని వాళ్ల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న రూ.10 లక్షల సహాయం తక్షణమే చేయాలని కోరారు. అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల మండలంలో 144 సెక్షన్

ద్వారకాతిరుమల: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడి అరెస్టు కారణంగా సానుభూతిపరులు చేస్తున్న నిరసన కార్యక్రమాల నేపథ్యంలో ఎటువంటి ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా మండల రెవెన్యూ పరిధిలో ఈనెల 16 వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. కావున నలుగురు కంటే ఎక్కువ మంది గుమ్మికూడి ఉండరాదని, అలాగే ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించే వారు ముందుస్తుగా అధికారుల నుంచి అనుమతులు పొందాలని ఆయన సూచించారు.

ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ సొసైటీ భవనం ప్రారంభం

కొయ్యలగూడెం: అంకాలగూడెంలో నాబార్డ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీ ఉమాభోగలింగేశ్వర ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కోఆపరేటివ్ సొసైటీ నూతన భవనాన్ని ఉద్యాన శాఖ అధికారి ధీరజ్ లక్ష్మణ్ ప్రజాప్రతినిధులతో కలిసి ఆదివారం ప్రారంభించారు.

నూతన వలంటీర్లకు నియామక పత్రాలు అందజేత



నూతన వలంటీర్లకు నియామక పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: ప్రజాసేవే లక్ష్యంగా వలంటీర్లు తమ విధులను నిర్వర్తించాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని సత్తెన్నగూడెంలో ఇటీవల తొలగించిన వలంటీర్ల స్థానంలో, మరో 5 గురు వలంటీర్లను కొత్తగా నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి దేవరపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో నూతన వలంటీర్లు మానుకొండ ప్రసన్నకుమార్, కుమ్మరి అనురాధ, తాడేపల్లి అశ్విని, తోరం మమత, తానిగడప నాగమణి లకు ఆదివారం నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ద్వారకా తిరుమల చినవెంకన్న దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు మానుకొండ సుబ్బారావు ఉన్నారు.

జూబ్లీహాల్ ఏర్పాటు అభినందనీయం

దెందులూరు: వేగవరం ఆర్‌సీఎం చర్చిలో తన పేరుతో జూబ్లీహాల్‌ను ఏర్పాటు చేయడం పీఠాధిపతిగా ఎంతో సంతోషాన్నిచ్చిందని ఏలూరు పీఠాధిపతి డాక్టర్ పొలిమేర జయరావు అన్నారు. వేగవరం ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం వేళంగిణి మాత ఉత్సవాలు ముగింపు సందర్భంగా బిషప్ జయరావును, ఫాదర్ మోజెస్‌తోపాటు వేగవరం విచారణ యువత, సంఘపెద్దలు, సంఘస్తులు సత్కరించారు.